# తెలుసుకున్న సత్యం

**గోపాల్ నడుచుకుంటూ మెట్లెక్కుతున్నాడు. రోహిణి మాన్పడి చూస్తోంది.**

ముడివడిన కనుబొమలు మరుక్షణంలో విడివడ్డాయి. 'అమ్మయ్య, ఇంతేకదా' అన్న తేలికైన భావం ఆమె ముఖంలో ప్రస్ఫుటమయింది. సుదీర్ఘంగా విశ్వసించింది. ఆత్రంగా అంది– "ఏమైంది కాలికి?"

"గాజుపెంకు బాగా గుచ్చుకుంది. డాక్టర్ దగ్గిరికి వెళ్ళవలసి వచ్చింది."

"అంతేకదా,బయపడిపోయాను!" ఆమె కాఫీ, ఫలహారం తేవటానికి లోపలికి వెళ్ళింది.

గోపాల్ ముఖం చిటపటలాడింది. 'ఎంత తేలికగా అంది! నా బాధ తనకేం తెలుసు? ఎంత రక్తం పోయింది! ఎంత లోతుగా కొయ్యవలసివచ్చిందో! తను చూడలేక పోయాడుగానీ...'

ముఖం కడుక్కుని వచ్చి కూర్చున్నాడు. ఆమె స్టూలు దగ్గిరగా జరిపి కాఫీగ్లాసు, పకోడీలు పెట్టిన పళ్లెం దానిమీద పెట్టింది.

ఒక పొట్లాన్ని జేబులోనించి తీసి విప్పి, ఒక మాత్ర మింగి కాఫీ తాగాడు. ఆమె చూసీ చూడనట్టు ఊరుకుంది. కాస్త దూరంలో మరో స్టూలు మీద కూర్చుని కాఫీ తాగుతూంది.

"ఉత్తరాలేమైనా వచ్చాయా?" ఆత్రతగా అడిగింది.

"లేదు."

"అయ్యో, అమ్మావాళ్ళు వ్రాసి చాలా రోజులయింది. ఎలా ఉన్నారో ఏమో?" ఆమె ముఖం మేఘావృతమైంది. తల్లిదండ్రులు జ్ఞాపకం రావటంతో ఏదో అనిర్వచనీయమైన బాధకు లొంగిపోయింది. ఇద్దరికీ కులాసాగా లేదన్న ఉత్తరం వచ్చి అప్పుడే పక్షం రోజులు దాటాయి. ఇంతవరకు మరి కబురులేదు. ఎందువల్లనో? ఆమె పరధ్యానంగా కాఫీ తాగుతూంది.

"ఎదురుగా ఉన్నాను. ఈ నొప్పికి ప్రాణం పోతూంది. నన్ను గూర్చి పిసరంత ఆందోళన, జాలి లేదు. ఇదేదో చిన్నదైనట్లు తీసి పారేసింది. ఎంత నిర్లక్ష్యం! ఏం పట్టనట్లు ఏమిటీ ప్రవర్తన?" గోపాల్ మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తూ బాధపడుతూంది. ధ్యాన భంగం అయినట్లు గబుక్కున లేచింది.


"సావిత్రి వాళ్ళు పేరంటానికి రమ్మన్నారు. వాళ్ళ అన్నయ్యలు వచ్చారట. మీరూ వస్తే వాళ్ళను కలిసినట్లుంటుంది. నా వాయనం తీసుకున్నాక వచ్చెయ్యచ్చు. మీకు పొద్దు పోతుంది."

"నువ్వు వెళ్ళు. నా కంత ఓపిక లేదు."

రోహిణి భర్తకేసి వింతగా చూసింది. మారు మాట్లాడకుండా తయారయింది. మూడేళ్ళ కొడుకును వెంటబెట్టుకుని సావిత్రి వాళ్లింటికి వెళ్ళటానికి ఉద్యుక్తురాలౌతూ అంది. "పాలు వస్తే పోయించుకోండేం. పిల్లికి బాగా అలవాటయింది. భద్రంగా పెట్టండి."

గోపాల్ మాట్లాడలేదు. కాలు పైకెత్తి పెట్టి ఈజీఛైర్‌లో పడుకున్నాడు. రోహిణి వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన దిక్కుకేసి




ఈ వారం ఆణి ముత్యం కోమలాదేవిగారి రచన 'తెలుసుకున్న సత్యం' (ఆంధ్ర ప్రభ **31.8.66** సంచిక) ప్రచురిస్తున్నాం.

చూస్తూ పళ్ళు పటపటలాడించాడు.

"ఆ పేరంటం లేకపోతే ఏం పోయిందిట! తనింతగా బాధ పడుతూంటే ఒక్క మంచి మాటన్నదీ? సానుభూతి చూపిందీ? అసలు ఆపరేషన్‌ను గూర్చిన వివరాలేమైనా అడిగిందీ? ఎలా గుచ్చుకుంది? ఎప్పుడు? ఎక్కడ? ఏం చేస్తున్నప్పుడు? ఏ డాక్టరు? ఎంత గాజు ముక్క? మత్తు మందిచ్చారా? రక్తం చాలా పోయిందా? ఎన్ని గంటలకు వెళ్లారు? ఇప్పుడెలా ఉంది? కాపడం పెట్టనా? ఏదైనా మందు ఇచ్చారా?... అన్నీ తెలుసుకోవాలని లేదూ! అదే పోతుంది. ఫరవాలేదని ధైర్యం చెప్పద్దూ? అదీలేదు. జాలి లేదు. ఏదో మునిగిపోయినట్లు బయలు దేరింది. పైగా పనులు పురమాయిస్తూంది. హు" అనుకుంటూ అశాంతితో చిన్నగా మూలుగుతున్నాడు.

కాలికి ఇచ్చిన ఇంజెక్షన్ శక్తి తగ్గుతూంది. నొప్పి ఎక్కువ అవుతోంది. కాలు జివ్వు, జివ్వు మంటూంటే కోపం తారాజువ్వలా పైకి ఎగసి పోతూంది! పాలవాడు కేకేశాడు.

ఎప్పుడూ నోటివెంట రాని శాపనార్థాలు పెడుతూ కుంటుకుంటూ పాలు పోయించుకుని తను కూర్చున్న గదిలోనే పెట్టుకున్నాడు ఎందుకేనా మంచిదని.

ప్రతి నిమిషం ఎదురుచూస్తూనే ఉన్నాడు ఆమె రాక కోసం.

బాధ ఎక్కువౌతున్నకొద్దీ ఆమెపై కోపం అవధులు దాటుతూంది. రోహిణి వెళ్ళిన గంటలోనే తిరిగివచ్చినా ఎన్నో గంటలు గడిచినంతగా బాధపడ్డాడు.

బాబు అరిటిపండు తండ్రికి చూపుతూ తింటున్నాడు. ఏదో కబురు చెపుతున్నాడు.

వినే ఓపిక లేదు. కస్సుమని కసిరాడు.

రోహిణి భర్తవైపు చురచుర చూసి కొడుకును లోపలికి తీసుకు వెళ్ళిపోయింది.

పులుసు, కూర వేడిచేసి భోజనానికి లెమ్మంది.

"నాకేం వద్దు."

"అదేమిటీ – కాలు నొప్పి అయితే తింటానికేం? లేవండి, లేవండి. ఆలస్యమై పోయింది ఇప్పటికే." భర్త రాకకోసం ఎదురు చూడకుండానే పీటలు వేసి కంచాలు పెట్టింది.

మళ్ళీ పిలిచింది.

"నాకొద్దో అని మొత్తుకుంటున్నా వినవేం?" ఈసారి కంఠం బాగా హెచ్చించాడు.

రోహిణి విసుక్కుంది. "అబ్బ, రాగానే చెప్పినట్లయితే బియ్యం తగ్గించేదాన్నిగా. ఈ రోజుల్లో ఇంత అన్నం మిగిలితే ఎలా? కాస్త ఎంగిలిపడి..."

"ఎంగిలీ లేదు, గింగిలీలేదు. నోరు మూసుకున్నావంటే కడుపునిండా తిన్నంత..." హు... హూ అంటూ బాధ పడుతున్నాడు.

ఆమె నోరు మూసుకుందనే చెప్పాలి.

భోజనం చేశాక కాఫీ కలిపి తెచ్చింది.

"ఇదైనా తాగండి."

"నాకేం వద్దు."

"దీనికేం?"

"ఏమీ అక్కర్లేదు."

"ఎందు కంత కోపం? ఎవరిమీద?"

మధ్యలోనే అందుకున్నాడు. "నా కాలి మీద. ఎవరి మీద కోపగించుకుంటే ఎవరు ఊరుకుంటారు?"

రోహిణి అక్కడినుంచి వెళ్ళిపోయింది. ఇంకాస్త బతిమాలుతుందనుకున్నాడు. ఏవో కబుర్లు చెప్పి లాలించి బుజ్జగిస్తుందనుకున్నాడు. ఏదీ జరక్కపోయే సరికి కాలి నొప్పికన్నా ఆ నొప్పి అధికమైంది.

"ఒరే, నాన్నా, తాగుతావుట్రా" అని బిగ్గరగా అంది.

"ఓ" అని వాడు తల్లి దగ్గిరికి పరిగెత్తటం ఓరగా చూశాడు. కడుపులో మంట. ఆకలికి కడుపు మాడుతోంది. రోహిణి ఏమీ పట్టించుకోవటం లేదన్న మంటతో మనిషి మగ్గిపోతున్నాడు.

పక్కలు వేసింది.

గోపాల్ మూలుగు కాస్త బిగ్గరగానే వినిపిస్తూంది.

బాబు పక్కలో పడుకుని కబుర్లు చెపుతూందామె. "సావిత్రివాళ్ళ అన్నయ్యలు మిమ్మల్ని మరీ మరీ అడిగారు. ఏవో సంబంధాలు చూడడానికి వెళుతున్నారట. మూడు రోజులకు తిరిగి వస్తారుట. అప్పుడు వచ్చి చూస్తారుట మిమ్మల్ని. ఏమైంది కాలికని మహా కంగారు పడిపోయారనుకోండి. 'బాబూ, ఏమీలేదు. చిన్న గాజుపెంకే' అని ఏమీ పరవాలేదని చెప్పిన తరవాత కాస్త కుదుట పడ్డారు. వాళ్ళ కంగారు చూసి బలే నవ్వుకున్నాం నేను సావిత్రీ. వాళ్ళ నాన్నగారికి ఒంట్లో కులాసాగా లేదుట. మన డాక్టరు గారిని కలవమని చెప్పాను. లక్ష్మి అత్తారింటినించి వచ్చింది. ఎంత చక్కటి చీర కట్టిందనుకున్నారు! నాలుగో నెలట. భర్తకు మొన్ననే గెజెటెడ్ పోస్ట్ వచ్చిందిట. హసీనా కూడా వచ్చింది. ఇద్దరూ అమ్మాయిలే. కవలల్లా ఉన్నారు. సావిత్రి కొడుక్కి బాగా ఒళ్ళు వచ్చిందండోయ్. వాడిని చూస్తే వాడౌనో కాదో అన్న అనుమానం రాకపోదు. నేను బాగా చిక్కిపోయానట. 'కళ్ళు ఇంతేసి లోతుకు పోయాయేం?' అని లక్ష్మి ఒకటే గోల. దానిలో తప్పేముందనో? పడుకోరాదూ? నొప్పిగా ఉందా? ఉండదుటండీ. కత్తిపీట తెగితేనే అల్లాడిపోతాం కదా! ఓర్చుకుని పడుకుంటే... హాయిగా నిద్రపడితే... నొప్పి అంతా మరిచిపోతే..." రోహిణి మాటలు తేలిపోయాయి. నిద్ర వస్తున్న గుర్తుగా ఆమె సందర్భం లేకుండా ఏదో వాగి నిద్రపోయింది.

గోపాల్ ఆమె మాటలు అయిష్టంగానే విన్నాడు. "తన ఊసే పట్టలేదు. ప్రేమగా దగ్గిరికి వచ్చి కాఫీ గ్లాసు నోటికి అందించి ఉంటే తను తాగకుండా ఉండేవాడా! పోనీ, మెల్లిగా తనను లేపుకుని వెళ్ళి పీటమీద



## వి'చిత్ర' వ్యాఖ్య పోటీ ఫలితం - 25

మేము ప్రారంభించిన వి'చిత్ర' వ్యాఖ్య పోటీలో మా ఊహకు మించి పాఠకులు పాల్గొని వ్యాఖ్యలు పంపారు. అందరికీ మా అభినందనలు. మాకు వచ్చిన (7-07-2004 సంచిక) వ్యాఖ్యలలో ఈ క్రింది వ్యాఖ్యను ఉత్తమంగా ఎన్నిక చేయడమైనది.

**" కొవ్వొత్తి వెలుగుతో చీకట్లు తొలుగు**
**మా తార తళకులే మామదికి వెలుగు."**

**పంపినవారు**

**జె. రామకృష్ణ, వరంగల్**

వీరికి ప్రియదత్త వారపత్రిక మూడు మాసాల పాటు అందజేస్తాము. – ఎడిటర్

కూచోపెట్టి నాలుగు ముద్దలు తినిపిస్తే ఏం పోయిందిట! ఏవో చల్లని కబుర్లతో తన ధ్యాసను మళ్లించి అన్నం పెట్టినట్లయితే లక్షణంగా అర్ధసేరు బియ్యం తినేవాడే! ఏదో చిన్న ఆపరేషనట! తనకేం తెలుసు? నెమలి కంటి నీరు సామెతలా ఉంది. హు. ఏం మనిషో. నొప్పిగా ఉండదూ మరి? ఈవిడ బోడి అభిప్రాయాలెవడిక్కావాలి? పడుకుంటే... నిద్రపడితే... చెప్పటానికేం? మా రాజులా చెప్పచ్చు. బాధ పడేది తాను కాదూ! ఇక్కడ నేనింత సతమతమౌతుంటే అక్కడికెళ్ళి వాళ్ళ చీరలు, నగలు చూసి గంటన్నరసేపు ఉత్తుత్తి కబుర్లు చెప్పుకుని తాపీగా వచ్చింది. ఎంత బాధపడుతున్నారో అని ఆవగింజంత ఆందోళన పడిందీ?"

"హు" అని లేచి నించుని ఒక్కమారు ఒళ్ళు విరుచుకున్నాడు. కాలు బాగా మోపు చేసింది. ఎలాగో పక్కమీద మేను వాల్చాడు. సగం నిద్దట్లో గొణుగుతోంది రోహిణి. "పై కిటికీ రెక్కలు తెరవండి."

ఆ మాటలు వినపడనట్లే పడుకున్నాడు.

మరి కాసేపటికి రోహిణి గాఢ నిద్రలో మునిగి పోయింది.

గోపాల్‌కు నిద్ర రాలేదు. భార్యపై కోపం, నొప్పి రెండు కలిసి నిద్రాదేవిని తరిమి కొట్టాయి. ఎప్పుడో అర్ధరాత్రివేళ నిద్ర పట్టింది. అదీ డాక్టర్ ఇచ్చిన నిద్రమాత్రలు వేసుకున్న తరవాత.

ఆమెకు రాత్రి మధ్య ఎప్పుడో మెలకువ వచ్చింది. భర్తను చూసింది. అతడు నిద్రపోతూంటే పరవాలేదనుకుంది.

తెల్లవారింది. బారెడు పొద్దెక్కాక లేచాడు గోపాల్.

వంట ఇంట్లోనించి కేకేసింది. "త్వరగా ముఖం కడుక్కు రండి. కాఫీ కలుపుతున్నాను."

నిద్రమందు ప్రభావం కాబోలు ఆ క్షణం వరకు గోపాల్‌కు గడిచిన రాత్రి గుర్తుకు రాలేదు. రోహిణి స్వరం వినగానే కోపం జడలు విప్పుకుంది. "కుశల ప్రశ్నలేసిందీ? ఎలా ఉంది? నొప్పి తగ్గిందా? రాత్రి నిద్ర పట్టిందా? ఏమీ లేదు. త్వరగా వెళ్లాలిట. వెళ్లను." అనుకుంటూ మునివేళ్లపై నడుస్తూ పెరట్లోకి వెళ్లాడు. కాలు మంచం మీద వున్నంత సేపూ బాగానే వుంది. కానీ కింద పెట్టగానే జివ్వుమంది. పాదంమీద బరువు పడేకొద్దీ సమ్మెటతో కొట్టినట్లే బాధపడ్డాడు. కళ్ళలో నీళ్ళు తిరిగినంత పని అయింది. ఎలాగో నిలదొక్కుకుని ముఖం కడుక్కుని ఇవతలికి వచ్చాడు. రోహిణి వేడివేడి కాఫీ అందిస్తూ పకాలున నవ్వింది.

"ఒక్క పూట భోజనం మానేసరికి అబ్బాయిగారి ముఖం చూడాలి... ఈ కాస్త దానికే ఇంత హంగామా!" భర్త జవాబు చెప్పే లోగానే పడకలు సర్దటానికి వెళ్ళిపోయింది. కాస్సేపటికి వంట ఇంట్లోకి వెళుతూ అంది. "కూరగాయలు బొత్తిగా లేవు. ఏమైనా తెస్తేనే సరి. లేకపోతే చారు. అప్పడాలే గతి."

## శ్రీ మల్లాది సూరిశాస్త్రి మరిలేరు



సాహిత్య సంగీతాల్లో తనకంటూ ఒక ప్రత్యేకత, గుర్తింపు పొందిన శ్రీ మల్లాది సూరిశాస్త్రిగారు (సూరిబాబుగా సాహితీప్రియులకు సుపరిచితులు) ఇటీవల మరణించారు. 75 సంవత్సరాల వయసుగల శ్రీ సూరిబాబు ప్రముఖ సినీ గేయ రచయిత స్వర్గీయ మల్లాది రామకృష్ణశాస్త్రిగారి రెండవ కుమారుడు. సంగీత, సాహిత్యాలలోనే గాక జ్యోతిషంలో కూడా మంచి ప్రవేశం గలవారు. వీరు రచించిన 'ఔటర్ సిగ్నల్' కథకు 1966 ఆంధ్రపత్రిక దీపావళి కథల పోటీలో రెండవ బహుమతి లభించింది. 'అమృతమయ ధనం' పేరిట వీరి కథాసంకలనం కూడా వెలువడింది. 'హరివిల్లు' పేరుతో అనేక వ్యాసాలు, నాటికలు రాశారు.

వీరు 2004 మే నెల 13 వ తేదీన హైదరాబాదులో కుటుంబ సభ్యుల సన్నిధిలోనే మరణించారు. వీరి మరణం సంగీత, సాహిత్య, జ్యోతిషాభిమానులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. భగవంతుడు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించమని కోరుతున్నాము.

– 'ప్రియదత్త'

"నే వెళ్ళలేను. అదే చెయ్యి" అన్నాడు ముభావంగా.

"అరె, వెళ్లకపోతే ఎలా? సావిత్రి, హసీనా, లక్ష్మీ అందరూ సాయంత్రం వస్తారుట. పళ్ళు తెస్తే ఏదైనా స్వీటు ఇంట్లో చేస్తాను."

గోపాల్ ఆమెవైపు విస్తుపోయి చూస్తున్నాడు. 'పెన్సిల్ చెక్కుతూ వేలు తెగితే నానా హంగామా చేసి బాండేజి కట్టిన రోహిణేనా? మామూలు ఫ్లూ వచ్చి బాగయ్యాక రెండు రోజులు క్యాజువల్ లీవు పెట్టి విశ్రాంతి తీసుకోండని గొడవ చేసిన రోహిణేనా? తలనొప్పిగా ఉందంటే వేడివేడి కాఫీ తయారు చేసి మందు తెచ్చి యిచ్చి, ఏవో కబుర్లు చెపుతూ కొంత ఉపశమనం కలిపించే ఆమేనా ఈమె! వాటన్నిటికన్నా యమయాతనగా ఉన్న ఈ బాధతో బజారుకు వెళ్ళమంటూంది. ఏం మనిషి? సమయానుకూలంగా ఒక్క పరామర్శ మాట చాలదూ? ఊహు. ఏదో అయింది రోహిణికి.'

పట్టుదల, కోపం, ఉక్రోషంతో రిక్షా పిలిపించుకుని బజారుకి వెళ్ళి కావలిసిన సరుకంతా తీసుకు వచ్చాడు.

"అబ్బే, ఇవేం పళ్లండీ? ఇంత పెద్ద ఊళ్లో మీకు ఇవే కనిపించాయా? చచ్చు సామాను. కుళ్లుపళ్లు తేవటంలో మీకు మీరే సాటిసుమా!" ఎగతాళిగా అంటూ, ఓ నవ్వు పారేసి సామాను బుట్ట, పళ్లసంచీ లోపలికి తీసుకువెళ్లింది. మరో నిమిషానికంతా ఇవతలికి వచ్చి బతిమాలుతున్నట్లు అంది. "ఐస్‌క్రీమ్ చేసుకుందామా? సాయంత్రానికి తయారైతే సరదాగా తింటూ కబుర్లు చెప్పుకోవచ్చు. ఎన్నేళ్ళకో కలుస్తున్నాం మా స్నేహబృందం!"

గోపాల్ జవాబివ్వలేదు. రిక్షా ఎక్కి ఎక్కడికో వెళ్లిపోయాడు. రిక్షా వెళుతున్న దిక్కుకేసి చూస్తూ తల పంకించి, "ఇప్పటికిగాని అర్థం కాదు" అంది. గడియ వేసి లోపలికి వచ్చి భారభరిత హృదయంతో భర్త ఖాళీ చేసిన కుర్చీలో పడుకుంది. ఆమె సుకుమారమైన చెక్కిళ్లు అశ్రుధారలతో తేజోవిహీనాలయ్యాయి. "ఇప్పటికిగాని సత్యం బోధపడదు" అంది.

కొంతసేపు అలా కూచుని చప్పున లేచింది. అప్పుడే పది గంటలు కావస్తూంది.

వంట చేస్తున్న రోహిణి భర్త తలుపు తట్టగానే పరుగులమీద వచ్చి తలుపు తీసింది. ఆమెను చూడనట్లే గబగబా కుంటుతూ లోపలికి వెళ్లాడు. ఈజీ ఛైర్‌లో పడుకున్నాడు. కాలికి ఆధారంగా స్టూలు జరిపిందామె. గ్లాసు నిండా మజ్జిగ తెచ్చింది. "నాకు వద్దు" అన్నాడు. పెదవులు బిగించి కళ్ళు మూసుకున్నాడు.

రోహిణి మరో కుర్చీ లాక్కుంది. "కాలెలా ఉంది? డాక్టరేమన్నారు? చీము పట్టలేదు కదా? పోనియ్యండి. మాట్లాడకపోతే పరవా

లేదు. మజ్జిగ తాగండి."

"ఇక్కడ కూర్చుని నీ టైం పాడు చేసుకోవటం దేనికీ! వెళ్ళి ఆ ఐస్ క్రీమ్, స్వీటు తయారు చేసుకోరాదూ."

"అది అవుతుంది. మీరు తాగండి. చల్లగా తాగితే నా మీద కోపం పోతుంది."

"నీ మీద నా కెందుకూ కోపం?" కళ్ళు తెరిచి ఓ మాటు చూసి మళ్ళీ కళ్లు మూసుకున్నాడు.

"అలా కుదరదు. లేచి తాగాలి, మరి." ఆ కంఠం తాను కోరిన విధంగా ఉంది. ప్రేమ అంతా పొందుపరిచి ఎంతో మురిపెంతో లాలిస్తూ అన్న మాటలవి. ఆ స్వరంలోని ఆత్రత, ఆందోళన గమనించిన గోపాల్ వెంటనే కళ్లు తెరిచి చూశాడు. ఇది సంభవమేనా? ఇది కలా? నిజమా?

రోహిణి గ్లాసు పెదిమల దగ్గిరికి తెచ్చింది.

అతని ముఖంలో అలముకుంటున్న సంతృప్తి వెలుగు కళ్లను వెలిగిస్తూంటే గ్లాసు అందుకుని గడగడా తాగేశాడు.

ఆమె గ్లాసు అందుకుని వెళ్లబోయింది.

గబుక్కున చెయ్యి పట్టుకున్నాడు. ఆమె కాలి వైపు దృష్టి మరల్చి అంది. "డాక్టర్ దగ్గిరికి వెళ్లినట్టున్నారు? ఏవన్నారు?"

"చీము పట్టిందని ఓ పెన్సిలిన్ గుచ్చి పంపాడు. చిన్నముక్క మిగిలిపోయిందేమోనని మళ్ళీ చూచాడు. ప్రాణం పోయిందనుకో!"

"అయ్యో, పాపం" అన్నట్టు చూసింది.

ఏదో అడగాలనుకున్నాడు. కానీ ఏమీ అడగలేకపోయాడు.

రోహిణి లోపలికి వెళ్లిపోయింది. ఆవేళ గోపాల్ సెలవు పెట్టటం వల్ల ఆలస్యంగా భోజనం చేశారు. బాబు నిద్రపోయాడు.

ఇద్దరూ విశ్రాంతిగా పడుకున్నారు.

"ఏవైనా కబుర్లు చెప్పనా? పోనీ, ఓ కథ చెప్పనా? మీరు నొప్పి మరిచిపోగలరు. ఏం?" ఆమె లేచి కూచుంది.

గోపాల్‌కు చాలా తృప్తిగా ఉంది. చిన్న పిల్లాడిలా గోము చేసి ముచ్చటలన్నీ తీర్చుకుంటున్నాడు. 'చేసే వాళ్ళు, బాధల్ని చెపుతూంటే వినేవాళ్ళు ఉంటే ఎన్ని కష్టాలనైనా భరించవచ్చు' అనుకున్నాడు. నడిచేటప్పుడు ఆమె భుజంపై చెయ్యిమోపి నడుస్తూంటే, తిన బుద్ధి కావటం లేదన్నప్పుడు బతిమాలించుకుంటే బాధతో కోపంగా అరిస్తే శాంతంగా లాలిస్తూ సముదాయిస్తూంటే గోపాల్‌కు ఎంతో హాయిగా ఉంది. నిన్నటికి, ఇవాల్టికి ఎంత తేడా! కాలికింద రెండు తలగడలు పెట్టుకుని వెల్లకిలా పడుకుని అప్పుడప్పుడు బాధ వ్యక్తం చేస్తూంటే రోహిణి పేలవంగా నవ్వుకుంది.

"ఒక ఊళ్ళో ఓ భార్యాభర్తలు ఉన్నారట. చాలా అన్యోన్యంగా ఉండేవారట."

"మనలా అన్న మాట!" భర్త మధ్యలో వేసిన ప్రశ్నకు నవ్వుతూ జవాబు చెప్పింది. "ఆ... మనలాగానే. మానవ జన్మ ఎత్తాక రోగం-రొష్టూ అనేవి ఉండనే ఉంటాయి. వాళ్ళకు పిల్లలు లేరు. వారి ఆనందం భర్తీ కాకుండా అలాగే ఉండిపోయింది. పాపం, ఒక రోజు స్నానం చేస్తూ బాత్‌రూమ్‌లో పడిందామె. లేచిన వేళావిశేషం. ఏ ఎముకా విరగలేదు గానీ నడుముకు బాల్చీ నొక్కుకుని నడుం దగ్గిర బాగా నొప్పి చేసిందట!"

గోపాల్ గబుక్కున ఇటు తిరిగాడు.

"రోహిణి, కొంపదీసి ఇది మన కథగాని కాదు కదా!"

"అయితేనేం? వినకూడదా?"

అతడు తదేకంగా భార్యవైపు చూస్తున్నాడు. ఆమె ఇదేమీ గమనించటంలేదు. బాబు సమ్మర్ సూట్ మీద పూలు కుడుతోంది.

"పాపం, ఆమెకు పడ్డప్పుడు తెలీలేదుగానీ, సాయంత్రానికి నడుం బాగా నొప్పి చేసింది. వెల్లకిలా పడుకుని ఉన్నంతసేపు బాగుంది. కానీ, తరవాత కదలబోతే నొప్పి. అయిదు కావస్తోంది. అతి ప్రయాసతో లేచి కాఫీ తయారుచేసి ఫ్లాస్క్‌లో పోసింది. టిఫిన్ చెయ్యటానికి ఓపికలేక అన్నం, పప్పు, పులుసు చేసింది. ఆ వేళ అతను రావటం ఆలస్యం అయింది. బాగా ఆకలి వేసింది కాబోలు వెంటనే ఏదైనా తినటానికి సిద్ధమయ్యారు. ఆమె తీసిపోయిన ముఖంతో చెప్పింది పడినట్లు. అంతలోనే బాబు బంతితో ఆడుతూ అది విసిరేసరికి సరాసరి ఎగిరి పాలల్లో పడింది. స్టౌ మీద కాబట్టి పాలన్నీ నేల పాలయ్యాయి..."

"ఇదంతా ఎందుకు? ఇదేం కథ రోహిణీ, ముందు బాబు లేడన్నావుగా?"

"ఇదొక కథ. ఎందుకు చెపుతున్నానో మీకే తెలుస్తుంది. మిగతా సంగతులు తెలుసుకోక ముందే పాలు పడిపోవటంతో వాడిని బాదేశారు. పాలులేని డికాక్షన్ గ్లాసులో పోసి టిఫిన్ లేదంది. ఏదో ఉన్నది పెట్టమన్నాడతను. సరే అన్నం, పప్పు, పులుసు, ఆవకాయ, నెయ్యి, మజ్జిగ పెట్టింది. బాబు గొంతెత్తి ఏడుస్తున్నాడు. పులుసు కలుపుకున్నారు. బాగాలేదు. 'ఇదేం కూర? మహ బాగా చేశావులే! నీ మొహంలా ఉంది' అంటూ లేచిపోయారు. బాబును ఓదారుస్తూ కళ్లనీళ్లు పెట్టుకుందామె. ఇక అంతకన్నా ఏమి చేయగలదు? దెబ్బ తగిలిందా అనిగానీ, ఎలా పడ్డావనిగాని ఏమీ అడగలేదు. అసలు ఆమె పడిన విషయం పూర్తిగా మరిచిపోయినట్లే ఉన్నారు. కానీ బాబు 'అమ్మకు నెప్పి' అంటూ పాట పాడుతూ తిరుగుతున్నా విన్నట్లు లేరు. విన్నా అదొక పిరికితనం. ఏం చాకిరీ చేయవలసి వస్తుందో! ఏం వినవలసివస్తుందో! ఇదే భయం అయి ఉండాలి. సరే, ఆమెకు ఆ రాత్రి జ్వరం వచ్చింది. నొప్పి ఎక్కువ కాలేదు గానీ ఒళ్ళంతా నొప్పులే. పడుకోటానికి సిగ్గు వేస్తోంది. అభిమానం కొద్ది లేచింది. ఎంతో ఓర్చుకుని తిరుగుతూంది. కూరగాయలకని బజారుకు వెళ్ళినవారు తిరిగి వచ్చి 'ముగ్గురు స్నేహితులు భోజనానికి వస్తారు రాత్రికి' అని చెప్పారు.




ఆమె గుండెల్లో రాయి పడింది. క్రితం రాత్రి సరిగా వంట చేయలేకపోయింది. టిఫిన్ కూడా చేయలేదు. "ఏం బాధో ఎక్కడ తగిలిందో దెబ్బ? ఎందుకని చేయలేదో?" అన్న ఆలోచన లేకపోయింది. తనకై తాను చెప్పుకోటానికి సిగ్గుపడింది. బాధపడేది తను. అతనికేం? ఆ రోజు భోజనాలు తయారు చేసి వడ్డించి సర్దుకునేసరికి నడుము విరిగిపోయి నంత పని అయింది. మరుసటి రోజు ఆయన పనికి వెళ్ళిపోగానే డాక్టరు దగ్గిరికి వెళ్లింది. ఆమె పరీక్ష చేసి మందులు, మలాములు ఇచ్చి రోడ్డు రోజుకి నొప్పి తగ్గకపోతే తిరిగి రమ్మంది ఎక్స్‌రేకు. భగవంతుని దయవల్ల ఎలాగూ అంత తీవ్రం కాలేదు. రోజు రోజుకి నొప్పి తగ్గుతూ వచ్చింది. వారం రోజులకు ఏభై రూపాయల బిల్లు వేసింది. ఎవరి నడగాలి? నాకెవరు ఉన్నారు? 'కింద పడ్డావా? ఎలావుంది? అని అడిగే దిక్కులేని నాకు అన్ని రూపాయలెవరిస్తారు?' అర్జంటుగా కావాలని సావిత్రి నడిగి డబ్బు ఇచ్చాను. ఆ తరవాత నాన్నగారికి ఏవో అబద్ధాలు కల్పించి ఏభై పంపమని రాశాను. అదంతా జరిగిపోయింది. సంవత్సరం దాటింది. కానీ ఇది నాలో మానని పుండయిపోయింది."

గోపాల్ పక్కకు తిరిగి ఆమె వైపు చూస్తూ కోపోద్రేకంతో అన్నాడు. "బాత్‌రూమ్‌లో పడ్డాను. పెద్ద దెబ్బ తగల్లేదనుకోండి. అని అన్నావుగా, నాకు బాగా జ్ఞాపకం."

రోహిణి నిర్జీవంగా నవ్వింది. "నిన్న మీరు రాగానే 'కాలికేమైంది?' అని అడిగితే మీరు 'ఏదో గాజుపెంకేలే గుచ్చుకుంది. మరేం పరవాలేదు' అని ముందు నా కంగారు పోగొట్టాలని చూస్తారు. తరవాత వివరాలన్నీ చెపుతారు. ఇది మామూలుగా జరిగే విషయం. పెద్ద దెబ్బ అనలేదు. మరి ఏదో తగిలి ఉండాలిగా. మనిషి బాధ పడుతూ తిరుగుతూంటే ముఖంలో ఏ భావం అగు పించదా? బిడ్డ మొత్తుకుంటున్నా అదొక అర్థంలేని పిల్లల మాటల కింద లెక్కపెట్టారే! టిఫిను ఎగగొట్టి, వంట సరిగా చేయలేకపోయిన నాకు మరుసటిరోజు భారీ ఎత్తు భోజనాలకి ఏర్పాట్లు చేయమన్నారే? అదీ బోలెడు పిండి వంటలతో. లేచి కూర్చునేటప్పుడు ఏ లోటు గమనించలేక పోయారే! అంగుళం ఎత్తున మలాం పట్టిస్తూంటే 'ఎందుకీ వాసన వస్తూంది' అని ఊహించలేకపోయారే. ఆ రోజుల్లో నా మనస్సు క్షోభ అసలు బాధకన్నా మిన్నగా ఉండేది. ఒక్క మంచి మాట, సమయానుకూలంగా ఒక్క ఓదార్పు మాట, సానుభూతి, జాలి, దయ ఏదీ లేదు. పైగా వంట సరిగా లేదని తిట్టుకుంటూ లేచి పోవటం!

అబ్బ, అదంతా తలుచుకుంటే ఇప్పటికీ ఆ ఆవేదన భరించరానిదిగా వుంటుంది. ఒకరితో చెప్పుకుని కొంత ఉపశమనం పొందే విషయాలివి. సగం బాధ ఎదుటివారు నిజంగా



## ఆమె చాలా స్పెషల్!

కపూర్ వంశపు పిల్ల, కత్తిలాంటి ఫిగర్ కరీనాకపూర్ మొట్టమొదటి సారిగా (తన జీవితంలో) మరో ఆడపిల్లని మెచ్చుకుందోచ్! 'జగడాలమారి'గా కరీనాకపూర్‌ని చూసి చాలా మంది హీరోయిన్లు దూరంగా ఉంటుంటారు. కరీనా కూడా అందుకు తగ్గట్టుగానే ప్రవర్తిస్తూ ఉంటుంది. "ఐత్‌రాజ్ సినిమాలో ప్రియాంకా చోప్రా చాలా బాగా నటించింది. ఏమో అనుకున్నా కానీ ఆమె చాలా స్పెషల్" అంటూ తెగ మెచ్చేసుకుంది. ఈమె మెచ్చుకోలు చూసి ఇప్పుడు ప్రియాంకాచోప్రా ఏమంటుందో చూద్దాం!

భరించకపోయినా, ఇవతలి వారికి సగం బాధ తగ్గినట్లుంటుంది. ఎదటివారి బాధ అర్థం చేసుకుని ప్రవర్తిస్తే వారి కెంత హాయి! తన సుఖాన్ని, సంతోషాన్ని కాంక్షించే వారొకరున్నారన్న భావన మనిషికి ఎంత బలాన్ని ప్రసాదిస్తుంది! ఆ వారం రోజులు కూడా సరిగ్గా మాట్లాడలేకపోయారు. ఏదో కోపం. ముభావంగానే ఉంటూ వచ్చారు. ఇదేం అని అడిగితే ఏవో ఆఫీసు చికాకులు అని తేల్చి చెప్పేస్తారు. పోనీ, అవన్నీ ఒప్పుకున్నాం. కానీ అదే వారంలో అలా ముభావంగా ఉండటానికి కారణం నాకేం అర్థం కాలేదు. ఎందుకంత చులకనగా, ఏమీ పట్టనట్లు ప్రవర్తించారో తెలీదు...

అప్పటినించీ ఆలోచిస్తూనే ఉన్నాను.

నిన్న గబుక్కున మీ కాలు చూశాను. వెంటనే ఓ ఆలోచన తట్టింది. ఆనాడు మీరు ప్రవర్తించినట్లు ప్రవర్తిస్తే గాని మనిషి మాటకు, ప్రవర్తనకు విలువ తెలీదని అతి కష్టంతో అలా ప్రవర్తించాను.

ఇవ్వాళ ఎవరూ రావటం లేదు. లక్ష్మి, హసీనా ఎవ్వరూ రాలేదు. పేరంటం అంటూ ఏమీ లేదు. అసలు మీ కాలికేమైందో కనుక్కుందామని డాక్టరింటికి వెళ్లి అక్కడినించి సావిత్రి ఇంటికి వెళ్ళి పది నిమిషాలు కూర్చుని వచ్చేశాను.

రాత్రి మీరు నిద్రపోయేవరకు అశాంతితో బాధ పడుతూ చేయగలిగిందేమీ లేక అలా పడుకున్నాను. రాత్రి మందు వేసుకుని మీరు నిద్రపోయాకనే పడుకున్నాను.

వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యమన్నారు. ఔనా?"

ఆమె లేచి భర్త పక్కలో కూర్చుని పెదిమలపై చిరుహాసం లాస్యం చేస్తుంటే, "కోపం వచ్చిందా?" అంది.

గోపాల్ ఆమె చెయ్యిని గుండెలకు అదుముకున్నాడు. ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు. "ఆనాడు మూర్ఖంగా ప్రవర్తించాను. కానీ రోహిణీ, కోరి చేసిన పనికాదు. ఆఫీసు గొడవల్లో నన్ను నేను మరిచిపోయాను. అంతే కాని హృదయపూర్వకంగా అలా చెయ్యలేదు. అంధుడనై క్రూరంగా ప్రవర్తించాను. ఔను. ఇందులోని సత్యం తెలుసుకున్నాను. నన్ను క్షమించు రోహిణీ."

భర్త కళ్ళు చెమ్మగిల్లటం చూసి తప్పు అన్నట్లు కొంగుతో కన్నీరు తుడిచింది. "మీరు చేయగలిగిందేమీ లేకపోయినా, ఎప్పుడూ పట్టనట్లు ముభావంగా మాత్రం ఉండకండేం? పర్యవసానం అతి ఘోరంగా ఉంటుంది!"

"ఉంటుంది అని తెలికగా అనకు. నిన్నంతా, ఇవ్వాళ ఎంత వ్యథ చెందానో నీకు వేరే చెప్పక్కర్లేదు." అతను కళ్ళు మూసుకున్నాడు. రోహిణి హాయిగా ఒక్కసారి నిశ్వసించింది. *